స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యత ఇవ్వాలి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ పి.రంజిత్‌బాషా తదితరులు

కర్నూలు(సెంట్రల్): స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమం సదస్సులు, ర్యాలీల్లో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొనేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశించారు. ఆయన బుధవారం విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామం, మండలం, డివిజన్, జిల్లా స్థాయిల్లో జాతీయ జెండాలను ప్రదర్శించాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు పాల్గొని ఫొటోలను హర్ ఘర్ తిరంగ్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేలా చూడాలన్నారు. ప్రజలు కూడా వెబ్‌సైట్‌లో ఫొటోలను అప్‌లోడ్ చేసి సర్టిఫికెట్లను పొందవచ్చన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి పాల్గొన్నారు.

అన్ని గ్రామ పంచాయతీల్లో జెండా వందనం

ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని గ్రామ పంచాయతీల్లో జెండా వందనం కార్యక్రమం చేపట్టాలని, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రతిజ్ఞ చేసేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, మండలాల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లను ఆదేశించారు. ఆయన బుధవారం ఉదయం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. జాతీయ జెండాతో సెల్ఫీ దిగి ఫొటోలను వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేయాలని, ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ఎప్పుడు నిర్వహించినా సిద్ధంగా ఉండాలని సూచించారు. సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ శర్మ, ఆర్డీఓలు రామలక్ష్మి, ఎం.శేషిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ డీఎంలో వసతుల కల్పనకు ఆదేశం

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జగన్నాథ గట్టుపై ఉన్న ట్రిపుల్ ఐటీ (ఐఐఐటీ) డీఎంలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ కలెక్టర్ పి.రంజిత్‌బాషాను ఆదేశించారు. ఆయన బుధవారం విజయవాడ నుంచి ఐఐఐటీ డీఎం, ఏఐఐఎంఎస్ నిర్మాణ పనులపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. నాలుగు నెలల్లో ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. వీధి లైట్లను ఏర్పాటు చేసేందుకు వెంటనే టెండర్లను పిలవాలన్నారు. 2 ఎంఎల్‌డీ వాటర్, హైటెన్షన్ వైర్లకు సంబంధించిన బడ్జెట్‌ను రిలీజ్ చేసేందుకు ఆర్డర్ ఇస్తున్నట్లు చెప్పారు. అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి, ఐఐఐటీ డీఎం రిజిస్ట్రార్ గురుమూర్తి పాల్గొన్నారు.

రాజశ్రీ గౌరవ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు: కర్నూలు

I.P. No. 24/2024

చాకలి బాలస్వామి ... అర్జిదారు

VERSUS

కె. మధుకర్ వగైరాలు .. రెస్పాండెంట్స్

జనరల్ నోటీసు

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా పై అర్జిదారు తనను దివాలాకోరుగా ప్రకటించమని కోరుతూ పై కోర్టు నందు పై అర్జీ దాఖలు చేసినాడు. ఈ విషయంలో ఎవరికైన ఏమయినా అభ్యంతరాలు ఉన్న యెడల పై కోర్టు నందు 06-09-2024 ఉదయం 10.30 గంటలకు ఖుద్దున గాని, అడ్వకేట్ గారి ద్వార గాని హాజరై తమ ఆక్షేపణలు, అభ్యంతరాలు తెలుపుకోగలరు అని పత్రికా ముఖంగా తెలుపడమయినది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

H.K. జలంధర్‌రావు,
G.గోపాలకృష్ణయ్య,
అర్జిదారుపరం అడ్వకేట్, కర్నూలు.

క్లుప్తంగా

వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తా చాటాలి



వెయిట్ లిఫ్టింగ్ ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న భూపతిరావు

కర్నూలు (టౌన్): ఈనెల 30వ తేదీ నుంచి సెప్టెంబర్ 1వ తేదీ వరకు అనకాపల్లిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా వెయిట్ లిఫ్టర్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. న్యాయవాది శ్రీధర్ రెడ్డి, జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కేఈ శివ రాంగౌడ్, సంయుక్త కార్యదర్శి నాగరాజు గౌడ్, యూసుఫ్‌బాషా పాల్గొన్నారు.

రెండు టిప్పర్ల సీజ్



సీజ్ చేసిన కంకర టిప్పర్

కర్నూలు (టౌన్): కర్నూలు మండలం సుంకేసుల గ్రామ రహదారిలో రాయల్టీ అనుమతులు లేకుండా కంకరను తరలిస్తున్న రెండు టిప్పర్లను మైనింగ్ అధికారులు సీజ్ చేశారు. రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వ్యక్తుల వద్ద జరిమానా వసూలు చేసి టిప్పర్లను రిలీజ్ చేస్తామని జిల్లా గనుల శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ బుధవారం వెల్లడించారు. ఈ తనిఖీల్లో టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్, శంకర్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్, కాపర్ చోరీ



చోరీ జరిగిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఏడీఈ సుబ్బన్న

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్, కాపర్ వైండింగ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. కల్లూరు మండలం దూపాడులో జాతీయ రహదారి పక్కన ఉన్న 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌లో మంగళవారం అర్ధరాత్రి తర్వాత చోరీ జరిగిందని విద్యుత్ శాఖ రూరల్ ఏడీఈ సుబ్బన్న తెలిపారు. రూ.25 వేల విలువ చేసే ఆయిల్, కాపర్ వైండింగ్‌ను చోరీ చేసినట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఘటనా స్థలానికి వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించామని, ఉల్లిందకొండ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. చోరీ నేపథ్యంలో ట్రాన్స్‌ఫార్మర్లపై నిఘా పెంచినట్లు వివరించారు.

ఏఓను కలిసిన ఏపీఆర్ఎస్ఏ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్ పరిపాలన అధికారి (ఏఓ)ను ఏపీఆర్ఎస్ఏ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఆమె ఏఓగా నియమితులైన నేపథ్యంలో ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు గిరికుమార్ రెడ్డి అధ్యక్షతన నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై స్పందించాలని కోరారు. నాయకులు నాగరాజు, రామాంజనేయులు, లోకేశ్‌రెడ్డి ఉన్నారు.

వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ 18న సదస్సు

కర్నూలు(సెంట్రల్): కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి తెచ్చిన సవరణలను వ్యతిరేకిస్తూ ఈ నెల 18వ తేదీన గుంటూరు నిర్వహించే రాష్ట్రస్థాయి సదస్సును జయప్రదం చేయాలని ఆవా జ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.అబ్దుల్‌సుభాన్ పిలుపునిచ్చారు. బుధవారం పాతబస్తీలోని ఆ వాజ్ కమిటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర సదస్సుకు సంబంధించిన పోస్టర్ల ను నాయకులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే ముస్లిం మైనార్టీలపై మోదీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందన్నారు. ఈ క్రమంలో వక్ఫ్ ఆస్తుల ను ప్రైవేట్ పరం చేసేందుకు కుట్ర పన్నుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో ఇలియాజ్, బయాజుల్ కరీం, సయ్యద్ అహ్మద్, సయ్యద్‌బాష పాల్గొన్నారు.

ఆస్పత్రిలో వీధి లైట్ల ఏర్పాటు

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల పీజీ వైద్య విద్యార్థుల వసతి గృహాల వద్ద బుధవారం రాత్రి అధికారులు వీధి లైట్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో వీధి లైట్లు ఉండగా అదనంగా మరికొన్ని లైట్లను అమర్చారు. దీంతో పాటు వసతి గృహ పరిసరాల్లో అపరిచిత వ్యక్తుల కదలికలను పసిగట్టేందుకు సీసీ కెమెరాలను బిగించారు. ఈ ఏర్పాట్లను సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, కర్నూలు మెడికల్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్ పరిశీలించారు. జూనియర్ డాక్టర్ల ఆందోళన నేపథ్యంలో వారి డిమాండ్ల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు వారు తెలిపారు.

వైద్య విద్యార్థుల డిమాండ్లు పరిష్కరిస్తాం



వైద్య విద్యార్థులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): వైద్య విద్యార్థుల డిమాండ్లను పరిష్కరిస్తామని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆసుపత్రి శుశ్రుత భవన్‌లోని సర్జికల్ విభాగంలో బుధవారం ఉదయం ఫస్టియర్ పీజీ వైద్య విద్యార్థి అరవింద్‌పై రోగి సహాయకుడు దాడి చేయడంతో వైద్య విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. అనంతరం ఈ విషయమై ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో సమీక్ష నిర్వహించారు. వైద్యులపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని, దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ శాఖను కోరారు. వైద్య విద్యార్థులు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందించగా ఆయన సానుకూలంగా స్పందించారు. సెక్యూరిటీ ప్రొటెక్షన్, పీజీ విద్యార్థులకు రూమ్స్, బాత్‌రూమ్‌లను త్వరలో అందుబాటులోకి తెస్తానని హామీ ఇచ్చారు. సెక్యూరిటీ సూపర్‌వైజర్లు రోజూ ఆస్పత్రిలోని అన్ని విభాగాల్లో రౌండ్స్ నిర్వహించి సమస్యలుంటే పరిష్కరించాలన్నారు. షిఫ్ట్‌ల వారీగా పనిచేస్తూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఎమర్జెన్సీ విభాగాధిపతి డాక్టర్ రామశివనాయక్, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ హేమనళిని, ఏఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ బ్రాంచ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు, సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ ఆసుపత్రి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తిపాటి నాగరాజు హామీ ఇచ్చారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో బుధవారం ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ బ్రాంచ్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రికి అవసరమైన మౌలిక సదుపాయాలు, సిబ్బంది కొరత, వైద్య ఉద్యోగుల సమస్యలు తన దృష్టికి వచ్చాయన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగుల వల్ల ఏర్పడిందని, వారి సమస్య ఏదైనా ముందుండి పరిష్కరిస్తానని చెప్పారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని చెప్పారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.బాలయ్య, ఎ.గిరిబాబు మాట్లాడుతూ.. ఆప్కాస్ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలు, ఐఆర్ అమలు, సీపీఎస్ రద్దు, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఖాళీగా ఉన్న స్ట్రక్చర్ బేరర్, ఎంఎన్‌ఓ/ఎఫ్ఎన్‌ఓ, పారామెడికల్, నర్సింగ్, నాలుగో తరగతి ఉద్యోగుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలునాయక్, రాష్ట్ర కార్యదర్శి జి.అబ్రహం పాల్గొన్నారు.

అఖండ భారత్ సంకల్ప దివస్ ర్యాలీ



ర్యాలీకి ముందు పూజలు చేస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ నాయకులు

కర్నూలు కల్చరల్: విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బుధవారం అఖండ భారత్ సంకల్ప దివస్ కార్యక్రమం జరిగింది. మన లక్ష్యం – అఖండ భారతం పేరుతో జిల్లా కేంద్రంలోని గోశాల ఆవరణలోని శ్రీకృష్ణ సప్త గో ప్రదక్షిణశాల నుంచి వివేకానంద సర్కిల్ వరకు కాగడాల ర్యాలీ నిర్వహించారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ మద్దిలేటి, జిల్లా కార్యదర్శి భానుప్రకాష్, లలితా పీఠం వ్యవస్థాపకులు మేడా సుబ్రహ్మణ్యం, భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాపరెడ్డి, జిల్లా సంయోజక్ వెలగల సాయిరాం, వీహెచ్‌పీ నాయకులు గోరంట్ల రమణ, నీలి నరసింహ, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

పల్లేటి మరణం తీరని లోటు



పల్లేటి కులశేఖర్ చిత్రం పటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్: ప్రముఖ రచయిత పల్లేటి కులశేఖర్ మరణం నాటక రంగానికి తీరని లోటని పలువురు కళాకారులు పేర్కొన్నారు. కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం మద్దూరునగర్‌లోని పింగలి సూరన తెలుగుతోటలో పల్లేటి కులశేఖర్ సంస్మరణ సభ జరిగింది. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం అధ్యక్షుడు జి.అంకయ్య మాట్లాడుతూ.. నాటక రంగంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఆయన రచనలకు 88 నంది అవార్డులు వచ్చాయన్నారు. కర్నూలు జిల్లా రంగస్థల కళాకారులు, దర్శకులు వీవీ రమణారెడ్డి, సీహెచ్ చంద్రన్న, డి.దస్తగిరి, బైలుప్పల షఫీయుల్లా, హనుమాన్ కళా సమితి అధ్యక్షుడు హనుమంతరావు చౌదరి, జీఎస్ఆర్కే శర్మ, అరుణకుమారి, శామ్యూల్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

డ్రగ్స్‌ను కట్టడి చేయాలి

కర్నూలు సిటీ: ప్రభుత్వం మద్యం, డ్రగ్స్ నుంచి విద్యార్థులను రక్షించాలని ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో బుధవారం సదస్సు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయి ఉదయ్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరుణమ్మ, అలివేలమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా పాల్గొని ప్రసంగించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతో మంది ప్రాణత్యాగాలు చేశారని, జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న దేశాన్ని నిర్మించడం విద్యార్థులకు మాత్రమే సాధ్యమవుతుందన్నారు. డ్రగ్స్ నిర్మూలన, రాష్ట్రంలో మహిళల రక్షణ అంశాల్లో విద్యార్థులే ముందుండి నడిపించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేయించారు. ఆయా సంఘాల నాయకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నగరాన్ని అభివృద్ధి చేస్తాం

- మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ రామయ్య, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు: నగరంలోని 52 వార్డులను అభివృద్ధి చేస్తామని మేయర్ బీవై రామయ్య, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తెలిపారు. బుధవారం కల్లూరు అర్బన్ పరిధి 29వ వార్డులోని ఇండస్ స్కూల్ సమీపంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి భూమి పూజ చేశారు. శిలాఫలకం ఆవిష్కరించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ రామయ్య మాట్లాడుతూ కర్నూలు నగరంతో పాటు, కల్లూరు అర్బన్ పరిధిలోని వార్డులో కూడా ప్రాధాన్యత మేరకు పనులు చేపడుతామన్నారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాల పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, స్థానిక కార్పొరేటర్ సంగాల సుదర్శన్‌రెడ్డి, ఎంఈ షాకీర్, డీఈ నరేష్, ఏఈ భాను తదితరులు పాల్గొన్నారు.

17న మంత్రాలయంలో విద్యాసంస్థల బంద్



సమావేశంలో మాట్లాడుతున్న సోమన్న

కర్నూలు(సెంట్రల్): రచ్చుమర్రి మోడల్ స్కూలులో 10 రోజుల క్రితం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన బాలిక పార్వతి ఉదంతాన్ని నిరసిస్తూ ఈ నెల 17వ తేదీన మంత్రాలయం నియోజకవర్గవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ పాటిస్తున్నట్లు ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ప్రకటించాయి. బుధవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న మాట్లాడుతూ.. బాలిక మృతిపై సమగ్ర విచారణ చేపట్టడంలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపించారు. పది రోజుల క్రితం చనిపోతే ఇప్పటివరకు పోస్టుమార్టం కాకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ సంఘటనపై జాయింట్ కలెక్టర్ విచారణ జరిపినప్పటికీ నిజాలు బయటకు రావడంలేదన్నారు. ఈ క్రమంలో 17వ తేదీన మంత్రాలయం నియోజకవర్గ విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చినట్లు చెప్పారు. నాయకులు అశోక్, మధు, బ్రహ్మారెడ్డి, సుశాంత్, వీరేష్, కిషోర్ పాల్గొన్నారు.

ఐఐఐటీలో ఎస్‌బీఐ శాఖ ప్రారంభం



ఎస్‌బీఐ శాఖను ప్రారంభిస్తున్న జీఎం సంజయ్‌కుమార్, రిజిస్ట్రార్ గురునాథ్

కర్నూలు (అగ్రికల్చర్): నగర శివారులోని జగన్నాథగట్టుపై ఐఐఐటీ ఆవరణలో విద్యార్థులు, ప్రొఫెసర్లకు సౌకర్యంగా ఉండేలా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖను ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ తెలిపారు. బుధవారం ఐఐఐటీ ప్రాంగణంలో ఎస్‌బీఐ శాఖను రిజిస్ట్రార్, ప్రొఫెసర్ గురునాథ్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం సంజయ్‌కుమార్ మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ అందిస్తున్న వివిధ రుణ పథకాలపై అవగాహన కల్పించారు. డీజీఎం దినేష్‌గులాటి, ఆర్ఎం శ్రీనివాస్, బీఎం బంగారుబాబు, తదితరులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్‌ఐఓ గురవయ్య శెట్టి

కర్నూలు సిటీ: స్థానిక బీ క్యాంపులోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కాలేజీ విద్యార్థులు బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేపట్టారు. 78వ భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని జిల్లా వృత్తివిద్యాధికారి వై.పరమేశ్వరరెడ్డి, ఇంటర్మీడియెట్ ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్య శెట్టి, ఏపీ టూరిజం డిస్ట్రిక్ట్ ఆఫీసర్ విజయ, సెట్కూరు సీఈఓ రమణ, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ మహబూబ్ బాషా ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించి ప్రసంగించారు. విదేశీయుల పాలన నుంచి మన దేశానికి విముక్తి కల్పించేందుకు స్వాతంత్ర్య పోరాటం చేసి అసువులు బాసిన వారందరిని స్మరించుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. ర్యాలీలో 60 మీటర్ల జాతీయ జెండాను ప్రదర్శించారు. కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి



సిబ్బందితో 'హర్ ఘర్ తిరంగా' ప్రతిజ్ఞ చేయిస్తున్న డీపీఓ నాగరాజునాయుడు

కర్నూలు (అర్బన్): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటా జాతీయ స్ఫూర్తి వెల్లివిరిసేలా తిరంగా జెండాను ఎగురవేయాలని డీపీఓ నాగరాజునాయుడు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో సిబ్బందితో హర్ ఘర్ తిరంగా ప్రతిజ్ఞ చేయించారు. ప్రభుత్వ సూచనల మేరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఎందరో మహనీయుల త్యాగ ఫలాల కారణంగా సిద్ధించిన దేశ స్వాతంత్ర్య స్ఫూర్తిని భావితరాలకు అందజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేశారు. ఏఓ ప్రతిమ, సిబ్బంది పాల్గొన్నారు.

శకటాల ప్రదర్శన.. సేవలకు ప్రశంస

కర్నూలు(సెంట్రల్): ప్రతి సంవత్సరం స్వాతంత్ర, గణతంత్ర దినోత్సవాల్లో వివిధ ప్రభుత్వ శాఖలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేసేందుకు ఛాయాచిత్రాలతో కూడిన స్టాళ్లు, శకటాలను ప్రదర్శించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో గురువారం 78వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రిపబ్లిక్‌డే నుంచి ఇప్పటి వరకు జరిగిన పనుల పురోగతిని ఆయా శాఖల ఆధ్వర్యంలో ప్రదర్శనకు ఏర్పాట్లు చేశారు. ఇకపోతే ఉత్తమ పనితీరు కనబర్చిన 336 మంది ఉద్యోగులకు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న స్వాతంత్ర వేడుకల్లో ప్రశంసా పత్రాలు అందించనున్నారు. వీరంతా ఉదయం 8.30 గంటల్లోపు పరేడ్ గ్రౌండ్ చేరుకోవాలని ఇప్పటికే సమాచారం చేరవేశారు. అదేవిధంగా ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా తమ ఇళ్లపై జాతీయ జెండాలను ఆవిష్కరించడంతో పాటు సెల్ఫీలు దిగి హర్ ఘర్ తిరంగా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులు పిలుపునిచ్చారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అభినందన

కర్నూలు కల్చరల్: నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంప్‌కు హాజరై తిరిగివచ్చిన రాయలసీమ విశ్వవిద్యాలయం, అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులను వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అభినందించారు. బుధవారం వర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వర్సిటీ తరఫున 10 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కర్ణాటక రాష్ట్రంలోని మంగళూరు విశ్వవిద్యాలయం పరిధిలోని మహవీర్ కళాశాలలో ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు జరిగిన క్యాంప్‌లో పాల్గొని ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పి.నాగరాజు మాట్లాడుతూ.. విద్యార్థులు పి.లోకేష్, వై.హేమలత, కె.సుకన్య, ఎన్.చైతన్య, బి.మెహరున్నీసా, ఎ.కె.హర్షవర్ధన్, ఎస్.సంపత్‌సాగర్, ఎ.ఎస్.అబ్దుల్ ఖాదిర్,వి. పవన్‌కుమార్, ఎ.తనుశ్రీ క్యాంప్‌లో పాల్గొన్నారన్నారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.వి.శివప్రసాద్ క్యాంప్ సమన్వయకర్తగా వ్యవహరించారన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంఆఫీసర్లు కేవీ రత్నం, విజయ్, నాగచంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.